సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

జిల్లా కేంద్రంలో 67వ రాష్ట్రస్థాయి బాల బాలికల ఖోఖో పోటీలు కొనసాగుతు న్నాయి. రెండోరోజు 10 బాలుర, 10 బాలికల జట్లు తలపడ్డాయి. 8లో▶



'ఉపాధి' ప్రణాళికపై కసరత్తు

2024–25 సంవత్సరానికి గాను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనులు గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నెల 30లోగా నివేదికలు అందించాల్సి ఉంది. 8లో▶



వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.5 /16.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు ప్రభావం ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

27న కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి తక్షణమే ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో ఈ నెల 27న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు బీఎస్పీ, ఆదివాసీ సంఘం, ప్రజా సంఘాల ఐక్యవేదిక, తుడుం దెబ్బ తదితర సంఘాల నాయకులు వెల్లడించారు. కాగజ్‌నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, ఆయా సంఘాల నాయకులు సోయం చిన్నన్న, జి.నగేశ్, నక్క మనోహర్ తదితరులు మాట్లాడారు. షెడ్యూల్ ప్రాంతాల్లో సర్వాధికారాలు ఆదివాసీలకు ఉన్నపుడు గిరిజనేతరుడికి ఎలా ఇన్‌చార్జి ఇస్తారని ప్రశ్నించారు. ఎస్టీ మహిళను జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు.

పత్తి దళారులపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మార్కెట్ పరిధిలోని వాంకిడి, కెరమెరి, ఆసిఫాబాద్‌లో అనుమతులు లేకుండా రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ హైమద్‌ఖాన్‌కు గురువారం సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. దినకర్ మాట్లాడుతూ అమాయక రైతులను తూకాల్లో మోసం చేస్తూ తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. సీసీఐలో క్వింటాల్‌కు రూ.7వేలకు పైగా ధర ఉంటే దళారులు కేవలం రూ.6,500 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా తనిఖీలు ముమ్మరం చేసి, అనుమతి లేకుండా పత్తి కొనుగోలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు కార్తీక్, రాజేందర్ ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో గురువారం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. విపక్ష ఎంపీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజ్యసభ స్పీకర్, ఉప రాష్ట్రపతికి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్‌ను ఎంపీ కళ్యాణ్ బెనర్జీ అగౌరవంగా ఎగతాళి చేయడం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. దానికి వత్తాసు పలుకుతూ రాహుల్ గాంధీ వీడియో చిత్రీకరించడం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్ సంప్రదాయాలను మంటగలపడమే కాకుండా.. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించిన వారు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

12న 'చలో పార్లమెంట్'

కాగజ్‌నగర్‌టౌన్: ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్‌తోపాటు మరో 16 విద్యార్థి సంఘాలు జనవరి 12న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.భీమేశ్ తెలిపారు. కాగజ్‌నగర్ బీసీ హాస్టల్ వద్ద చలో పార్లమెంట్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడంతోపాటు అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ట్లు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 3 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని, ఈ బడ్జెట్ సమావేశాల్లో కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే విద్యాసంస్థలకు సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. సంవత్సరానికి 10లక్షల ఉద్యోగాలు కల్పిస్తామనే కేంద్ర ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు.

గంజాయి జోరు!

- జిల్లాలో అక్రమంగా సాగు
- ఆసిఫాబాద్ కేంద్రంగా రవాణా
- నానాటికీ పెరుగుతున్న వినియోగం
- కార్మికులు, విద్యార్థులే లక్ష్యంగా అమ్మకాలు
- ఇక్కడి నుంచే మహారాష్ట్రకు గంజాయి సరఫరా



జైనూర్‌లో స్వాధీనం చేసుకున్న 15 కిలోల గంజాయి(ఫైల్)

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా వ్యాప్తంగా గంజాయి సాగు జోరుగా సాగుతోంది. గంజాయి రవాణాకు కుమురంభీం జిల్లా కేంద్రంగా మారింది. కొందరు స్మగ్లర్లు రైతుల ద్వారా మారుమూల మండలాల్లో అంతర పంటగా అక్రమంగా సాగు చేయిస్తున్నారు. రైలు, రోడ్డు మార్గాల్లో సరిహద్దు రాష్ట్రం మహారాష్ట్రకు తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోనూ గంజాయి వినియోగం నానాటికి పెరుగుతోందని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా స్మగ్లర్లు కాలేజీ విద్యార్థులు, వలస కూలీలను లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం.

సరిహద్దు గ్రామాల్లో సాగు..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మహారాష్ట్ర సరిహద్దున ఉన్న గ్రామాల్లో గంజాయిని కొందరు రైతులు అక్రమంగా సాగు చేస్తున్నారు. పంట పెట్టుబడులు తక్కువగా ఉండటం.. పంట దిగుబడి విక్రయించడం ద్వారా అధికంగా లాభాలు వస్తుండడంతో వారు పత్తిలో అంతర పంటగా సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ పత్తి వ్యాపారి గంజాయి రవాణా ద్వారా అనతి కాలంలోనే రూ.కోట్లు ఆర్జించాడు. అతను పంట రవాణా ముసుగులో వాహనాల్లో మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం. పోలీసులు ఇతని కదలికలపై నిఘా ఉంచారు. ముఖ్యంగా జిల్లాలో కెరమెరి, జైనూర్, ఆసిఫాబాద్, తిర్యాణి, చింతలమానెపల్లి, కాగజనగర్ తదితర మండలాల్లో స్మగ్లర్లు అక్రమంగా రైతుల ద్వారా గంజాయిని సాగు చేయిస్తున్నట్లు సమాచారం. ఇలా సరిహద్దు గ్రామాల్లో పండించిన గంజాయిని గోనె సంచులో ప్యాక్ చేసి రైలు, రోడ్డు మార్గాల్లో మహారాష్ట్రకు రవాణా చేసి ఒక్కో స్మగ్లర్ రూ.లక్షలు సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ ఏడాది 19 మంది అరెస్టు..

అడవుల ఖిల్లాలో మారుమూల గ్రామాల్లో అటవీ ప్రాంతంలో ఉన్న పాలాల్లో గంజాయి సాగు చేస్తే ఎవరికి అనుమానం రాదన్న కారణంతో స్మగ్లర్లు కొందరు ఆయా ప్రాంతాల్లో అక్రమ సాగుకు తెరతీశారు. ఆసిఫాబాద్, జైనూర్, ఈజ్‌గాం ప్రాంతాల్లో పత్తి అంతర పంటగా గంజాయి సాగు ఎక్కువగా ఉంది. కెరమెరి మండలం సావర్‌ఖేడా గ్రామంలో కొందరు రైతులు గంజాయిని సాగు చేస్తుండగా ఎక్సైజ్, పోలీసులు పంటను ధ్వంసం చేశారు. నలుగురిపై కేసులు కూడా నమోదయ్యాయి. 2023 జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా తొమ్మిది కేసులు నమోదు కాగా.. అందులో జైనూర్‌లో 4, కాగజ్‌నగర్‌లో 2, ఈజ్‌గాంలో 2, ఆసిఫాబాద్‌లో ఒక కేసు నమోదు అయ్యింది. ఆరు కేసుల్లో రూ.3.43 లక్షల విలువైన 17.422 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 15 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇంటి ఆవరణలో సాగు చేస్తున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి 438 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొక్కల విలువ రూ.4,380. వారిపై మూడు కేసులు నమోదు చేశారు.

మత్తుకు బానిస..

అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాలో గంజాయి మత్తుకు అలవాటు పడిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా మహిళలపై పెరిగిపోతున్న వేధింపుల కేసులను గమనిస్తే గంజాయి బానిసలతో మహిళలు, బాలికల భద్రతకు ముప్పు ఏర్పడుతుందా? అన్న ప్రశ్నకు అవుననే సమాధానం వస్తోంది. నిషేధిత గంజాయి సాగు, విక్రయాలను అరికట్టకపోతే భవిష్యత్తులో జిల్లా గంజాయికి అడ్డాగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. స్మగ్లర్లు కాలేజీ విద్యార్థులు, వలస కూలీలను లక్ష్యంగా చేసుకుని గుట్టుచప్పుడు లేకుండా విక్రయాలు సాగిస్తున్నారు. కళాశాల విద్యార్థులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. కొందరు విద్యార్థులు దీనిని ఓ ఆదాయ మార్గంగా మలుచుకుంటున్నారు. స్మగ్లర్ల నుంచి గంజాయిని కొనుగోలు చేసి వారు ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకున్నట్లు సమాచారం.

ఉక్కుపాదం మోపుతాం

గంజాయి సరఫరా, సాగు చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతాం. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. జిల్లాలో 100 శాతం గంజాయిని నియంత్రించి గంజాయి రహిత జిల్లాగా మారుస్తాం. గంజాయి రవాణాకు పాల్పడిన నిందితులపై కఠినంగా వ్యవహరిస్తాం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం.

– సురేశ్‌కుమార్, ఎస్పీ

సిర్పూర్(యూ) @ 6.6 డిగ్రీలు

- రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు జిల్లాలోనే..
- వణుకుతున్న ఏజెన్సీ మండలాలు



చలిమంట కాగుతున్న ప్రజలు

తిర్యాణి/కౌటాల: జిల్లాల్లో రోజురోజుకూ రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతున్నాయి. చలి తీవ్రతకు ప్రజలు చిగురుటాకులా వణికిపోతున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సిర్పూర్(యూ) మండల కేంద్రంలో గురువారం రాష్ట్రంలో అత్యల్పంగా 6.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే ఇప్పటివరకు అత్యల్పం కావడం గమనార్హం. అలాగే తిర్యాణి మండలం గిన్నెధరిలో 7.3 డిగ్రీలు, తిర్యాణిలో 7.8, కెరమెరిలో 9.2, వాంకిడిలో 9.3, కాగజ్‌నగర్‌లో 9.5, ఆసిఫాబాద్‌లో 9.7 డిగ్రీలుగా నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు కూడా దారుణంగా పడిపోతున్నాయి. ఉదయం పది గంటలు దాటినా గ్రామాల్లో పొగమంచు ప్రభావం తొలగడం లేదు. రోజంతా వీస్తున్న చలిగాలులు ప్రజలను భయపెడుతున్నాయి.

'ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధికి గండి'



వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి పడుతోందని ఆల్ డ్రైవర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్, ఆసిఫాబాద్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీరామ్ సంతోష్‌చారి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరాకీ లేకపోవడంతో ఫైనాన్స్‌లపై తీసుకున్న ఆటోలకు కనీసం కిస్తీలు కూడా కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముంజం సాగర్, జాదవ్, వెంకటేశ్, రవి, రాకేశ్, సాదిక్ ఖాన్, సోల్జర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె కట్టలేదని పాఠశాలకు తాళం



రహదారిపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు

చింతలమానెపల్లి(సిర్పూర్): అద్దె భవనంలో నడుస్తున్న పాఠశాలకు గురువారం యజమాని తాళం వేయడంతో విద్యార్థులు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామ పంచాయితీ దరంపెల్లి ప్రాథమిక పాఠశాలకు పక్కా భవనం లేదు. దీంతో స్థానికంగా ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఏడు నెలలుగా అధికారులు భవనం యజమాని బొగ్గుల లక్ష్మికి అద్దె చెల్లించలేదు. కొద్ది రోజులుగా అద్దె చెల్లించాలని అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో యజమాని గురువారం పాఠశాల భవనానికి తాళం వేశారు. విద్యార్థులను బయటికి పంపించారు. విద్యాశాఖ అధికారుల తీరుకు నిరసనగా విద్యార్థులు బెజ్జూర్– కౌటాల రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పాఠశాలకు భవనం కోసం అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యార్థులకు వసతులతో కూడిన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



దుర్గం లక్ష్మితో అధ్యాపకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని అండర్– 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఈ నెల 14న నిర్మల్ జిల్లా చించోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో 9వ తరగతి చదువుతున్న దుర్గం లక్ష్మి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైందని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి 24వ తేదీ వరకు నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మిని వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, జూనియర్ వీపీ రజిత, పీడీ రజిత, పీఈటీ స్వరూప, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సాంబశివరావు, అధ్యాపకులు అభినందించారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో క్రీడాకారులు విక్కీ, చైతన్య, రవి, అజయ్‌ను పీడీ శంకర్, యాదగిరితో కలిసి అభినందించారు.

ఎమ్మార్పీఎస్ ధర్నా



ధర్నాలో జిల్లా నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నాలో జిల్లాకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరారు. నాయకులు రవి, ధర్మయ్య, మల్లేశ్, శ్రీనివాస్, లక్ష్మణ్, నరేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: నిరుద్యోగ యువతకు టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నట్లు ఆసిఫాబాద్ టాస్క్ రీజినల్ కేంద్రం మేనేజర్ సాయికుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. టెక్నికల్ కోర్సుల్లో భాగంగా సీసీ ప్లస్, జావా, పైతాన్ తదితర వాటిల్లో శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు జనవరి 1 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 31 లోగా టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95027 86438 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'గంగాపూర్' దశ మారేనా..?

- ఏళ్ల తరబడి కొనసాగుతున్న ప్రాజెక్టు నిర్మాణ పనులు
- కొత్త ప్రభుత్వ ఏర్పాటుతో చిగురిస్తున్న ఆశలు
- భూసేకరణ పనులు పూర్తి చేయాలని రైతుల డిమాండ్



అసంపూర్తిగా స్పిల్‌వే నిర్మాణం

రెబ్బెన(ఆసిఫాబాద్): బీడు భూములను పంట పొలాలుగా మార్చాలనే లక్ష్యంతో రెబ్బెన మండలంలోని నంబాల వాగుపై మంజూరైన గంగాపూర్ ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. 1300 ఎకరాలకు సాగు నీరందించేలా ప్రాజెక్టు రూపకల్పన చేసి 2008లో నిర్మాణ పనులు ప్రారంభించారు. 15 ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తి కాలేదు. కనీసం ప్రాజెక్టు తూము, కాలువ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ పనులు కూడా పూర్తి చేయలేదు. రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి

రూ.26 కోట్లకు చేరిన అంచనా వ్యయం

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో నంబాల వాగుపై గంగాపూర్ ప్రాజెక్టును నిర్మించతలపెట్టింది. వాగుకు అడ్డంగా మట్టికట్ట నిర్మాణం చేపట్టి తూము, కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాలని ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. రూ.9కోట్లతో ప్రాజెక్టును మంజూరు చేయగా 2009లో పనులు ప్రారంభించారు. అయితే 2010లో ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు పనులను సందర్శించి ప్రాజెక్టు డిజైన్ మార్చాలని ఆదేశించారు. వాగుకు అడ్డంగా మట్టికట్టల నిర్మాణం చేపడితే వరద ప్రవాహం ఉధృతికి కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, మట్టికట్టల స్థానంలో కాంక్రీట్ పనులు చేపట్టి కాలువ ద్వారా నీటిని మళ్లించాలని సూచించారు. ప్రాజెక్టు డిజైన్‌ను మార్చడంతో రూ.9కోట్లుగా ఉన్న అంచనా వ్యయం మూడు రేట్లు పెరిగింది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ స్పిల్‌వే పనులు పూర్తి చేయకుండానే చేతులు ఎత్తేశాడు. సుమారు నాలుగేళ్లుగా ఎలాంటి పనులు సాగడం లేదు. ఇరిగేషన్ అధికారులు మాత్రం కాంట్రాక్టర్‌పై ఉదాసీనత వ్యవహరిస్తూ గడువు పెంచుతూ వస్తున్నారు. పనులు చేపట్టని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

1300 ఎకరాలకు సాగు నీరు

సాగునీటి వనరులు లేక రెబ్బెన మండల రైతులు వర్షాధారంగా పంటలు సాగు చేస్తున్నారు. గోలేటి రిజర్వాయర్, వట్టివాగు కాలువలు అందుబాటులో ఉన్నా.. కాలువల నిర్వహణ సక్రమంగా లేక పొలాలకు సాగు నీరందడం లేదు. రైతులు ఆరుతడి పంటల సాగుకే మొగ్గు చూపుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ గంగాపూర్ ప్రాజెక్టు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా రెబ్బెన మండలంలో 1300 ఎకరాలకు సాగు నీరందేలా ప్రణాళికలు రూపొందించారు. నంబాల, గంగాపూర్, ధర్మారం, లక్ష్మీపూర్, పాశిగాం గ్రామాల్లోని పొలాలు, చెరువులకు నీరందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టుకు రూపకల్పన చేయగా, గత పాలకులు ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తిగా గాలికి వదిలేశారు. 15 ఏళ్లుగా రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

భూసేకరణపై దృష్టి సారిస్తే మేలు

2010లో ప్రారంభమైన ప్రాజెక్టు పనులు కేవలం 50 శాతం మాత్రమే పూర్తయ్యాయి. వాగుకు అడ్డంగా 320 మీటర్ల పొడవైన స్పిల్‌వే నిర్మించాల్సి ఉండగా కేవలం 262 మీటర్లు మాత్రమే నిర్మించారు. స్పిల్‌వే నిర్మాణంతోపాటు తూము, కాలువల పనులు ప్రారంభమే కాలేదు. మిగిలిన స్పిల్‌వే నిర్మాణంతో పాటు 9.5 కి.మీ. పొడవైన కాల్వల నిర్మాణానికి భూసేకరణ చేపడితే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. భూసేకరణలో రెవెన్యూ శాఖ అంతులేని అలసత్వం ప్రదర్శిస్తోంది. కాల్వలకు 70 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇందుకోసం అన్ని చర్యలను 2015లోనే ఇరిగేషన్ అధికారులు పూర్తి చేసి రెవెన్యూ అధికారులకు వివరాలు అందించినా భూసేకరణ ముందుకు సాగలేదు. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా అధికారులు దాదాపు రూ.18 కోట్ల వరకు బిల్లులు చెల్లించినట్లు సమాచారం. అయినా పంట పొలాలకు చుక్కనీరు అందలేదు.



మిగిలిన స్పిల్‌వే నిర్మాణం చేపట్టాల్సిన ప్రాంతం

ప్రాజెక్టు పూర్తి చేయాలి



15 ఏళ్ల క్రితం నంబాల వాగు మీద ప్రాజెక్టు ప్రారంభించారు. ఇప్పటివరకు పనులు పూర్తి కాలే. మా భూములకు సాగునీరు అందుతుందని ఆశపడ్డాం. పనులు మధ్యలోనే ఆపేశారు. మత్తడిని కూడా పూర్తిగా కట్టలేదు. ప్రాజెక్టు పూర్తి చేయాలి.

– ఇంగు మొండి, నంబాల

రైతులకు మేలు



రెబ్బెన మండలంలో సాగునీటి ప్రాజెక్టు ఒక్కటి కూడా లేదు. వట్టివాగు ప్రాజెక్టు కాలువల ద్వారా గంగాపూర్ వైపు చుక్క నీరు రావడం లేదు. కనీసం గంగాపూర్ ప్రాజెక్టు పూర్తయితే రైతులకు మేలు జరుగుతుంది.

– వడ్డె శంకర్, యువరైతు, గంగాపూర్

ప్రభుత్వం దృష్టి సారించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం గంగాపూర్ ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి సారించాలి. ప్రాజెక్టుకు కావాల్సిన భూసేకరణ పనులు పూర్తి చేసి పనులు తిరిగి ప్రారంభమయ్యేలా చూడాలి. ప్రాజెక్టు పూర్తయితే లక్ష్మీపూర్‌కు సైతం సాగు నీరందే అవకాశం ఉంది.

– కోలే శ్యాంరావ్, సర్పంచ్, లక్ష్మీపూర్

క్లుప్తంగా

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య



రాజాగౌడ్ మృతదేహం

భీమిని: అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చిన్నగుడిపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన రైతు రంగు రాజాగౌడ్ (60)కు భార్య లక్ష్మి, కుమారులు అంజన్న, సాయిప్రసాద్ ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజాగౌడ్‌కు రెండెకరాల పొలం ఉంది. అందులో పత్తి వేశాడు. పది ఎకరాలు కౌలు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో పంట పెట్టుబడికి చేసిన అప్పులు, గతంలో తీసుకున్న అప్పులు అధికమయ్యాయి. అవి ఎలా తీర్చాలని ఎప్పుడు బాధపడేవాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ప్రైవేట్ వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యన మృతిచెందాడు. కుమారుడు సాయిప్రసాద్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్కూటీ ఢీకొని ఒకరికి గాయాలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని తీరందాజ్ థియేటర్ సమీపంలో (సుభాష్ రోడ్డు) వద్ద గురువారం స్కూటీ ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన స్కూటీ ఢీ కొట్టడంతో గాయపడ్డ అతన్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీస్ అధికారులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గురువారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం జిల్లా లింగాపూర్ మండలం మోతిపటార్ గ్రామానికి చెందిన రాథోడ్ సచిన్ డిగ్రీ పరీక్ష రాయడానికి ఉట్నూర్‌కు వస్తున్న క్రమంలో ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాథోడ్ సచిన్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత



రామస్వామి మృతదేహం

దండేపల్లి: వ్యవసాయ బావిలో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం గంగన్నపేటకు చెందిన పేరాల రామస్వామి(42) కొద్ది రోజులుగా మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన లక్ష్మణ్ వద్ద వ్యవసాయ కూలీ పనులు చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదు. యజమాని లక్ష్మణ్ రామస్వామి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. గురువారం వెతుకుతుండగా బావిలో రామస్వామి మృతదేహం కనిపించింది. బావిలో చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు పడి చనిపోయాడని మృతుడి కూతురు గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో అవకాశం

- అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- జనవరిలో శిక్షణ ప్రారంభం



శిక్షణ కోసం ఏర్పాటు చేసిన బస్సు

మంచిర్యాలఅర్బన్: రోజురోజుకు వాహనాల సంఖ్య అంతకంతకు పెరుగుతున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రాబోయే రోజుల్లో ఆర్టీసీ మరిన్ని బస్సులు కొనుగోళ్లు చేసేందుకు కసరత్తు చేసింది. బస్సులు నడిపేందుకు డ్రైవర్లు తప్పనిసరి. ఇంకోవైపు నైపుణ్యం కావాలి. భారీ వాహనాలను నేర్చుకోవాలంటే ఎంతో కట్టుదిట్టమైన శిక్షణ అవసరం. వాహనాల డ్రైవింగ్ నేర్పించే సంస్థలు ఆడపాదడపా ఉన్నా నైపుణ్యత కలిగిన శిక్షకులు అంతంతే. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డిపోల్లో డ్రైవింగ్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. మంచిర్యాలలో రెండేళ్ల క్రితం అనుమతులు లభించాయి. ప్రస్తుతం మరోమారు అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించింది. అనుకున్నమేర వారు ముందుకువస్తే ఆర్టీసీ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణను జనవరిలో ప్రారంభించేందుకు ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు ప్రారంభించింది.

ప్రత్యేక వాహనంతో..

ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్రైవింగ్ స్కూల్‌లో సీనియర్ డ్రైవర్ల ద్వారా అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. డ్రైవింగ్ స్కూల్‌కు కావల్సిన కండీషన్ వాహనం (ప్రత్యేక బస్సులు) ద్వారా డ్రైవింగ్ నేర్పించనున్నారు. వాహనంలో రెండు బ్రేక్‌లు, క్లచ్, ఎక్స్‌లేటర్, డ్రైవింగ్ శిక్షణ ఇస్తారు. థియరీ బోధనకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయడం ద్వారా తర్ఫీదు ఇవ్వనున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన డ్రైవర్లకు ఆర్టీసీ సంస్థలో మొదట ప్రాధాన్యత కల్పిస్తారు. అద్దె బస్సుల సంఖ్య పెరగడంతోపాటు సంస్థ ఆధ్వర్యంలో బస్సుల కొనుగోళ్లకు నిర్ణయించారు. లారీలు, ఇతర వాహనాలపై క్లీనర్‌గా వెళ్లి సొంతంగా వెళ్లి ఆడపాదడపా నేర్చుకుంటున్న డ్రైవింగ్‌లో అనుకున్న మేర నైపుణ్యత లేకపోవడం..ఉపాధి అవకాశాలు కూడా తక్కువగానే ఉంటాయి.

డ్రైవింగ్‌లో శిక్షణ ఇలా..

ఆర్టీసీలో డ్రైవింగ్ స్కూల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కేంద్రం తెరిచి ఉంటుంది. శిక్షణ పొందే అభ్యర్థి రూ.15,500 వరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయస్సు పైబడినవారు మాత్రమే శిక్షణకు అర్హులు. అభ్యర్థులు శారీరక దారుఢ్యం కలిగి ఉండాలి. లైట్ మోటార్ వెహికల్ లైసెన్సులు పొంది తప్పనిసరిగా ఏడాది పూర్తయి ఉండాలి. డ్రైవింగ్ స్కూల్‌లో వెనులుబాటు బట్టి ఒక్కో అభ్యర్థి 36 రోజులు శిక్షణ ఇస్తారు. మొత్తం 16 గంటలు థియరీ తరగతులు, 20 గంటలు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. నైపుణ్యత కల్గిన ఆర్టీసీ సీనియర్ డ్రైవర్లు ఈ శిక్షణ ఇస్తారు.

జనవరిలో అభ్యర్థులకు పాఠాలు

డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ ప్రారంభం కావాలంటే ఒక బ్యాచ్‌లో 16 మంది అభ్యర్థులకు అవకాశం ఉంది. వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఆర్టీఏ నిబంధనల మేరకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశాం. శిక్షణ అవసరమైన ప్రత్యేక బస్సు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ముందుకు వస్తే డ్రైవింగ్‌స్కూల్ ప్రారంభిస్తాం. పూర్తి వివరాలకు ఆర్టీసీ డిపోలో సంప్రదించాలి.

– రవీంద్రనాథ్, డీఎం మంచిర్యాల

ఆ ముగ్గురి దారెటు..!

- టీబీజీకేఎస్‌కు కీలక నేతల రాజీనామా
- 'గుర్తింపు' ఎన్నికల్లో పోటీకి దూరమన్న పార్టీ
- భగ్గుమన్న నాయకత్వం
- సింగరేణి ట్రేడ్ యూనియన్ చరిత్రలో అరుదైన ఘటన

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సింగరేణిలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నిన్న మొన్నటి వరకు ఓ వెలుగు వెలిగిన గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌లో ఒక్కసారిగా చీకట్లు కమ్ముకున్నాయి. టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య గురువారం తమ పదవులు, యూనియన్‌కు రాజీనామా చేశారు. ఒకే లేఖపై ముగ్గురు సంతకాలు చేసి సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు పంపించారు. సింగరేణిలో చరిత్రలో ఇలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకోవడం ఇదే మొదటిసారి. ఎన్నికలను ఎదుర్కొనే సమయంలో ముఖ్య నేతలు రాజీనామా చేయడం కంపెనీలో తీవ్ర చర్చనీయాంశమైంది. వారి అనుచరగణం, డివిజన్ నేతలు, కార్యకర్తల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది.

పుట్టి ముంచిన పార్టీ..

ఎంతో ఉద్యమ చరిత్ర కలిగిన టీబీజీకేఎస్ పట్ల ఎన్నికల సమయంలో మాతృ పార్టీ బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్‌లో పురుగు పోసుకున్న టీబీజీకేఎస్ గత రెండుసార్లు గుర్తింపు సంఘంగా గెలిచింది. పార్టీ రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో ఇప్పుడు మూడోసారి ఎన్నికలు ఎదుర్కోలేని దుస్థితి దాపురించింది. ఇందుకు కారణం బీఆర్ఎస్ పార్టీయేనని నాయకులు పేర్కొంటున్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో పలుమార్లు ఈ ముగ్గురు నేతలు కవితను కలిశారు. హరీశ్‌రావుతోనూ భేటీ అయ్యారు. ముందు ఎన్నికలకు సిద్ధమనే సంకేతాలిచ్చి చివరికి పార్టీ తన వైఖరిని మార్చుకుంది. ఎన్నికల్లో పోటీ చేయవద్దని తాజాగా గౌరవ అధ్యక్షురాలు కవిత స్పష్టం చేయడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఎన్నికల్లో గుర్తు కూడా కేటాయించిన ఈ సమయంలో పోటీ నుంచి ఎలా తప్పుకోవాలి అని ప్రశ్నించిన కూడా ఆమె నుంచి సరైన సమాధానం రాలేదని తెలిసింది. కార్మికులకు అనేక హక్కులు, సదుపాయాలు కల్పించిన చరిత్ర ఉన్న సంఘం ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటే ఇంత కంటే ఆత్మహత్యా సదృశ్యం మరొకటి ఉండదని భావించి తమ రాజీనామాలు చేశామని ఈ ముగ్గురు నేతలు అనుచరగణం వద్ద వాపోతున్నారు. రాజీనామా చేసిన నేతలు ఏ యూనియన్‌లో చేరుతారనేది చర్చనీయాంశంగా మారింది. ముగ్గురు కలిసి ఒకే సంఘంలోకి వెళ్తారా, లేక ఎవరికి వారు తమ దారి చూసుకుంటారా అన్న చర్చ జరుగుతోంది. వీరితో మంతనాలు సాగిస్తున్న డివిజన్‌లోని వారి అనుచరగణ నేతలు రేపో మాపో వారి బాటలోనే రాజీనామాలకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. వీరంతా ఐఎన్టీయూసీ లేదా ఏఐటీయూసీకి వెళ్తారనే ప్రచారం ఉంది. ఏదేమైనా ఎన్నికలకు 5 రోజులు మిగిలి ఉండగా జరిగిన ఈ పరిణామం సింగరేణిలో తీవ్ర చర్చకు దారి తీసింది. యూనియన్ల రాజకీయాలకు కొత్త భాష్యం నేర్పింది.

ఆటోబోల్తా.. పలువురికి గాయాలు



నుజ్జునుజ్జయిన ఆటో

జన్నారం: ఆటోబోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన జన్నారంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రోటిగూడ గ్రామం నుంచి 9 మంది విద్యార్థినులు ఆటోలో జన్నారంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు వస్తుంటారు. ఎప్పటిలాగా గురువారం వస్తుండగా జింకల పునరావాస కేంద్రం సమీపంలో ఆటో వెనుక టైర్ పగిలింది. మూడుసార్లు పల్టీలు కొట్టి బండరాయిపై ఆగింది. అందులో ఉన్న విద్యార్థినులు చేపూరి కమల, నీరటి రమతోపాటు డ్రైవర్ నగేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 ద్వారా లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. ఆటో నుజ్జునుజ్జు కావడంతో పెద్ద ప్రమాదం నుంచి విద్యార్థినులు బయటపడ్డట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఎస్సై సతీశ్‌ను సంప్రదించగా, ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.

'ఉపాధి' ప్రణాళికపై కసరత్తు

- ఉమ్మడి జిల్లాలో 2024–25 పనుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
- నీటి అభివృద్ధి పనులకే అధిక ప్రాధాన్యం



కోటపల్లిలో ఈజీఎస్ గ్రామసభ

కోటపల్లి: వలసల నివారణకు అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024–25 సంవత్సరానికి గాను పనుల గుర్తింపు ప్రక్రియ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. ఈ నెల 30లోగా సంబంధిత నివేదికలు ఉన్నతాధికారులకు అందించాల్సి ఉంది. ప్రస్తుత సంవత్సరంతో పోలిస్తే రానున్న ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31వరకు కూలీలకు పూర్తి స్థాయిలో పని కల్పించడమే కాకుండా నీటి అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికల రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. గత వారం రోజులుగా ఏపీవోలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో పనులు గుర్తిస్తున్నారు. పనుల గుర్తింపునకు మంచిర్యాల జిల్లాలో గతంలోనే గ్రామసభలు నిర్వహించారు.

80శాతం పనులు పూర్తి...

ప్రస్తుత సంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5,84,039 జాబుకార్డులు ఉండగా, 11,53,949మంది కూలీలకు గాను 4,663మంది కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. సుమారు రూ.40కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. భూమి అభివృద్ధి పనులు, ఊరచెరువులు, పూడికతీత పాంఫాండ్స్ నిర్మాణాలు, చిన్ననీటి కుంటలు, ఇంకుడుగుంతల నిర్మాణాలు, హరితాహారం, వ్యవసాయ క్షేత్రాలకు రహదారులు, కందకాలు, వాలుకట్టలు, హరితహారం, ఇంకుడుగుంతలు, ముళ్లపొదలు తొలగింపు తదితర పనులున్నాయి. సుమారు 80శాతం వరకు పనులు చేపట్టినట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గతేడాది కంటే అధికంగా పనులు గుర్తించాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, పౌరుల భాగస్వామ్యంతో ఎక్కువమందికి పని కల్పించేలా చూడాలని ఆదేశించారు. ఈ పనులపై గ్రామసభలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటివరకు గుర్తించిన పనులను ఆన్‌లైన్ నమోదు చేయగా గ్రామాల వారీగా ప్రణాళికలు తయారు చేస్తారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆమోదం తదుపరి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తారు.

ప్రతీ కూలీకి పని కల్పించడమే లక్ష్యం...



ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో పని అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం. వచ్చే ఏడాది మార్చి నుంచి పూర్తిస్థాయిలో ఉపాధి పనులు ప్రారంభించనున్నాం. దీనికి సంబంధించి కార్యాచరణ తయారు చేస్తున్నాం. వచ్చే ఏడాది అడిగిన వారందరికీ పని కల్పించడమే లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో పనులు గుర్తిస్తున్నాం. – శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ మంచిర్యాల

జిల్లాలు	జాబ్‌కార్డులు	కూలీలు	వందరోజులు చేసిన కుటుంబాలు
మంచిర్యాల	120926	237682	479
ఆదిలాబాద్	169755	341474	707
నిర్మల్	172017	330528	2636
కుమురంభీం	121341	244265	841



'కోలిండియా ఒప్పందాలు అమలు చేస్తాం'

శ్రీరాంపూర్: కోలిండియాలో చేసిన ఒప్పందాలను అమలు చేయిస్తామని ఏబీకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి పులి రాజిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆర్కే 8 డిస్పెన్సరీలో కార్మికులను కలిసి మాట్లాడారు. చాలా ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయడం లేదన్నారు. తాము గెలిచిన తరువాత వాటన్నింటినీ అమలు చేయిస్తామని, కార్మికులకు స్వంతింటి పథకం అమలు చేస్తామని తెలిపారు. వైద్య సేవలు మెరుగుపరుస్తామని, జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ పేరును మార్చుతామని, సింగరేణిలో కొత్త భూగర్భ గనులు తీసుకువచ్చి కొత్త ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. యూనియన్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ్వ మహేశ్, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రవీందర్, పాగిడి శ్రీకాంత్, రాగం రాజేందర్, బొలంపల్లి రమేశ్, మద్దిల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'తప్పుడు ప్రచారంపై కేసు నమోదు చేయాలి'



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: కాంగ్రెస్ పార్టీకి చెందిన బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్‌లపై తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసర్ల యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెల్లంపల్లి, నెన్నెల మండలాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు గోలి శివ, మోతే రవీందర్, శ్రీనివాస్‌గౌడ్ ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనిపక్షంలో సీఎం, డీజీపీలకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ మాల మహానాడు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎరుకల శ్రీనివాస్, నాయకులు పీక లక్ష్మణ్, సబ్బని రాజనర్సు, చింతల రాజ్‌కుమార్, జుమ్మిడి వెంకటేష్, నిచ్చకోల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

- నేడు సెమీ ఫైనల్, ఫైనల్



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 67వ రాష్ట్రస్థాయి అండర్– 14 బాలబాలికల ఖోఖో పోటీలు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్నాయి. రెండోరోజు గురువారం గిరిజన బాలికల ఆదర్శ క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాల నుంచి 10 బాలుర, 10 బాలికల జట్లు తలపడ్డాయి. ఉదయం 10 గంటల నుంచి మొదలైన పోటీలు రాత్రి 8 గంటల వరకు రసవత్తరంగా సాగాయి. శుక్రవారం సెమీ ఫైనల్, ఫైనల్ పోరు జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

రెండో రోజు పోటీలు ఇలా..

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో నల్గొండపై వరంగల్ జట్టు విజయం సాధించింది. అలాగే నిజామాబాద్ జట్టుపై కరీంనగర్, కరీంనగర్‌పై మెదక్, నల్గొండపై మహబూబ్ నగర్, హైదరాబాద్‌పై ఆదిలాబాద్, హైదరాబాద్‌పై నిజామాబాద్, వరంగల్‌పై రంగారెడ్డి, మెదక్‌పై ఆదిలాబాద్, ఖమ్మంపై మహబూబ్‌నగర్, హైదరాబాద్‌పై కరీంనగర్, నల్గొండపై రంగారెడ్డి, నిజామాబాద్‌పై మెదక్, మహబూబ్‌నగర్‌పై వరంగల్, హైదరాబాద్‌పై మెదక్, కరీంనగర్‌పై ఆదిలాబాద్ జట్టు గెలుపొందింది. అలాగే బాలికల విభాగంలో వరంగల్ జట్టుపై నల్గొండ జట్టు గెలుపొందగా.. రంగారెడ్డిపై ఆదిలాబాద్, కరీంనగర్‌పై ఖమ్మం, ఖమ్మంపై రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌పై మెదక్, నిజామాబాద్‌పై నల్గొండ, హైదరాబాద్‌పై ఖమ్మం, కరీంనగర్‌పై మహబూబ్‌నగర్, నిజామాబాద్‌పై ఆదిలాబాద్, వరంగల్‌పై రంగారెడ్డి, హైదరాబాద్‌పై మెదక్, నల్గొండపై రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌పై ఖమ్మం, నల్గొండపై ఆదిలాబాద్, వరంగల్‌పై నిజామాబాద్, హైదరాబాద్‌పై కరీంనగర్, ఖమ్మపై మెదక్ జట్టు విజయం సాధించాయి. కాగా.. ఒక్కో జట్టు ఐదు మ్యాచులు ఆడుతుంది. అందులో విజయం సాధించిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుతుంది. అక్కడ విజయం సాధించనవి సెమీస్, ఫైనల్‌లో తలపడతాయి. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఎస్‌డీఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, ఏసీఎంవో ఉద్దవ్, కోచ్ విద్యాసాగర్, అరవింద్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై డీపీవోకు ఫిర్యాదు

తాండూర్: మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ కార్యదర్శిపై వార్డు సభ్యులు డీపీవోకు ఫిర్యాదు చేశారు. గురువారం మంచిర్యాలలోని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యపై వివరించారు. పంచాయతీలోని సీఈఆర్ క్లబ్ ఎదురుగా ఉన్న మూడు గుంటల స్థలంలో పంచాయతీ అవసరాల కోసం గతంలో ఓ స్టోర్ రూం నిర్మించి చుట్టూ ఫెన్సింగ్ వేశారని తెలిపారు. ప్రస్తుతం ఆ గది తన సొంతమని సర్పంచ్ భర్త చెబుతున్నారని పేర్కొన్నారు. స్టోర్ రూం విషయంలో తప్పుదారి పట్టించిన, గతంలో పోచంపల్లిలో ఇళ్ల నంబర్ల కేటాయింపులో విధులను దుర్వినియోగం చేశారని తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కుష్ణపెల్లి లక్ష్మీనారాయణ, పాముల పద్మ, గొర్లపల్లి బానేష్, లక్ష్మి, పాండాల భాగ్య పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఈ నెల 22 నుంచి 25వరకు పత్తి కొనుగోళ్లు నిలిపి వేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ మండలం రేపల్లెవాడ శివారులో ఉన్న రెండు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు ఎక్కువగా ఉన్నందున, ఖాళీ స్థలం కొరతతో కొనుగోలు నాలుగు రోజులపాటు నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

'రాజకీయ జోక్యాన్ని నివారిస్తాం'

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ గెలిస్తే సింగరేణిలో రాజకీయ జోక్యం ఉండనివ్వబోమని ఆ సంఘం శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. గురువారం ఆర్కే 7గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున ఐఎన్టీయూసీ గెలిస్తే రాజకీయ జోక్యం మరింత పెరుగుతుందని కొన్ని సంఘాల నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, ఐరెడ్డి తిరుపతిరెడ్డి, జాతీయ సమితి సభ్యులు భీంరావు, నాయకులు భీమ్ రవి, నర్సింగ్, మోతె రాఘవరెడ్డి, లాగల శ్రీనివాస్, కాల్వ శ్రీనివాస్, పేరం రమేష్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటారు..

బెల్లంపల్లి: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జైపూర్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చారు. అండర్–14 జావెలిన్ త్రోలో కె.సంకేత్ ప్రథమ శ్రేణిలో నిలిచి బంగారు పతకం సాధించాడు. బి.అనిల్ లాంగ్ జంప్, 60 మీటర్ల పరుగు పందెం, హైజంప్ పోటీలో బంగారు పతకం అందుకున్నాడు. అండర్–17 విభాగం లాంగ్‌జంప్ పోటీల్లో ఏ.అజయ్ కాంస్య పతకం దక్కించుకున్నాడు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.స్రవంతి, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మోహన్, పీఈటీ సంతోష్ పాల్గొన్నారు.

నస్పూర్ విద్యార్థులు..



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం పద్మజ, పీఈటీ

నస్పూర్: జైపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ఈ నెల 20న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో నస్పూర్‌లోని సీతారాంపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు బహుమతులు సాధించారు. అండర్–16 హైజంప్ బాలికల విభాగంలో వైష్ణవి ద్వితీయ స్థానం, ట్రై అథ్లాన్ అండర్–14 బాలికల విభాగంలో సునైనా ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో కే.రామన్న ద్వితీయం స్థానం సాధించారని పీఈటీ మారయ్య తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, పీఈటీ మారయ్య, పాఠశాల సిబ్బంది అభినందించారు.

మౌంట్ కార్మల్ ఉన్నత పాఠశాల..



పతకం సాధించిన దీక్షితతో ప్రధానోపాధ్యాయురాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట మౌంట్ కార్మల్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్.దీక్షిత అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. జైపూర్ మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో జరిగిన జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ ఫర్ నిడ్జమ్–2024 పోటీల్లో ప్రతిభ కనబర్చింది. అండర్–16 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకుంది. ఈ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ఆల్ఫీ, పీఈటీ ఆర్.నరేందర్, పాఠశాల సిబ్బంది దీక్షితను అభినందించారు.

చెస్టోబాల్ పోటీల్లో



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: పంజాబ్‌లో ఈ నెల 15నుంచి 17వరకు జరిగిన జాతీయ స్థాయి చెస్టోబాల్ పోటీల్లో నారాయణ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రష్మిత, గాయత్రి రజత పతకం సాధించారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత, డీన్ వెంకటస్వామి, ఏవో సంతోష్, పీఈటీ కుమార్ అభినందించారు.

కుస్తీ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు. ఈ నెల 20న క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ప్రజ్ఞ, స్వప్న ప్రతిభ కనబర్చారని తెలిపారు. త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.